సాక్షి మంచిర్యాల

శనివారం ; 17 ; ఫిబ్రవరి ; 2024



లక్క కోసం వృక్ష మేధం

IIలో▸

సరిహద్దు ప్రాణహిత తీరం వెంట ఉన్న అడవుల్లో లక్క సేకరణ జోరుగా సాగుతోంది. ఇందుకోసం బొజ్జ, తిరుమాను వృక్షాలు నేల కూల్చుతున్న వైనం వెలుగులోకి వచ్చింది.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ నెల 19న మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించాలని డీఈవో యాదయ్య ఆదేశించారు. ఆన్‌లైన్‌లో పోటీలు ఉంటాయని, పరీక్ష సమయంలో మండల ఇంచార్జీలకు లింక్(గూగుల్ ఫామ్) పంపిస్తారని తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు 8, 9వ తరగతి విద్యార్థులకు అవకాశం ఉందని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /18.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి.

అక్రమ వెంచర్లపై రగడ

- చర్యలు తీసుకోవాలని సభ్యుల పట్టు
- ప్రొటోకాల్ పాటించడం లేదంటూ నిరసన
- అధికారులు సమాచారం ఇవ్వకపోవడంపై మండిపాటు
- వాడీవేడిగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మంచిర్యాలటౌన్: జిల్లాలో అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై అటు పంచాయతీ, ఇటు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జెడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంతోపాటు నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, గోదావరి ముంపు ప్రాంతాల్లోనూ అడ్డగోలుగా ప్లాట్లు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. శుక్రవారం మంచిర్యాలలోని జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వాడీవేడిగా సమావేశం సాగింది. కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జెడ్పీ సీఈఓ గణపతి, డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, ఎంపీపీలు, జిల్లా అధికారులు హాజరయ్యారు.



నెన్నెల ఎంపీపీ, జెడ్పీటీసీ నిరసన, పాల్గొన్న సభ్యులు

ప్రొటోకాల్‌పై నిరసన

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. సమావేశ ఆరంభంలోనే జెడ్పీటీసీలు, ఎంపీపీలకు ఎమ్మెల్యేలు, అధికారులు సమాచారం కూడా ఇవ్వడం లేదంటూ నెన్నెల ఎంపీపీ సంతోషం రమాదేవి, జెడ్పీటీసీ సింగతి శ్యామల సమావేశంలో కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు సైతం మద్దతు తెలిపి, ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ బదావత్ సంతోష్ జోక్యం చేసుకుని ఇకపై పాటించేలా చూడాలని ఆదేశాలు ఇవ్వడంతో సద్దుమణిగింది.

- జైపూర్ ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ జైపూర్‌లో 150 వరకు వెంచర్లు ఏర్పాటు చేశారని, అందులో ప్రభుత్వ భూములు, రహదారులను కబ్జా చేసి ఏర్పాటు చేస్తున్నారని, పట్టా భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసినా నిబంధనల ప్రకారం రోడ్లు వేయడం లేదని తెలిపారు.
- జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ మాట్లాడుతూ సమావేశానికి ముందే అధికారులు నోట్స్ పంపించలేదని, సంబంధిత అధికారులు వివరాలు ఇస్తున్నారో లేదో చెప్పాలని అన్నారు. స్థాయీ కమిటీ సమావేశంలోనే ఇలాగే చేశారని తెలిపారు. వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులు కాలేదని అన్నారు. కలెక్టర్ సంతోష్ సమాధానమిస్తూ జెడ్పీ సీఈవో కొత్తగా వచ్చారని, మరోసారి అలా జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో కొందరు దళారులు రూ.50వేలకు పైగా తీసుకుని పరీక్ష రాయని వారికి సైతం సీటు ఇప్పిస్తున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ గురుకులాల ఆర్‌సీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్లంపల్లిలో అక్రమంగా వెంచర్లు వెలుస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.
- నెన్నెల ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యానశాఖ అధికారులు ఎవరో లేదని, కనీసం ఒక్కసారి కూడా మండలానికి రావడం లేదన్నారు. మండలంలోని చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయని తెలిపారు.
- కోటపల్లి ఎంపీపీ సురేఖ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఒక బాత్రూం మాత్రమే ఉందని, మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు.
- వేమనపల్లి జెడ్పీటీసీ రుద్రభట్ల స్వర్ణలత మాట్లాడుతూ మండలంలో రోడ్లు వేసేందుకు అటవీ శాఖ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని, వర్షాకాలం ఇబ్బందిగా మారుతుందని అన్నారు.
- చెన్నూరు జెడ్పీటీసీ మోతె తిరుపతి మాట్లాడుతూ పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు దళారులు పత్తి కొనుగోలు చేసి ఇక్కడి సీసీఐలో ఎక్కువ ధరకు అమ్ముతున్నారని, రైతులు సీసీఐలో అమ్మేందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు.

జనరేటర్‌తో పొలానికి నీరు

వ్యవసాయ శాఖ అధికారులను ఎమ్మెల్యేలు ఇంటికి పిలిపించుకుంటున్నారు. రైతు వేదికలు, రైతుల వద్దకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యంతో కొత్త కనెక్షన్ల కోసం డీడీలు కట్టి నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. జనరేటర్‌తో పొలానికి నీరు పెడుతూ అష్టకష్టాలు పడుతున్నారంటూ తన సెల్‌ఫోన్‌లో ఫొటోలతో సహా చూపించారు. అటవీ అధికారులు వాహనదారులను ఇబ్బందులు పెడుతున్నారు. కడెం డీ13 కాలువను కామన్‌పల్లి, దేవునిగూడ వద్ద మూడెకరాల వరకు కబ్జా చేశారు. రహదారి మూసుకుపోయి కనీసం సైకిల్ కూడా వెళ్లని పరిస్థితి ఏర్పడింది. వెంటనే కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి. భారీ వాహనాలకు రాత్రివేళ కవ్వాల్ అభయారణ్యంలోకి అనుమతి ఇవ్వకపోవడంతో కలమడుగు బ్రిడ్జి గుండా వస్తున్నాయి. దీంతో దూరం, ఆర్థిక భారం పెరుగుతోంది. భారీ వాహనాలకు కనీసం జన్నారం వరకైనా అనుమతించాలి.

– ఎర్ర చంద్రశేఖర్, జన్నారం జెడ్పీటీసీ సభ్యుడు

ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్

ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లలో ధాన్యం తరుగు కోత విధించలేదు. గతంలో కోత ఎందుకు విధించారు. డీసీఎమ్మెస్ ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్ జరుగుతోంది. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులతో రూ.4 కోట్ల వరకు దోచుకుంటున్నారు. నాలుగు సంవత్సరాల వరకు గన్నీ సంచులు పనికి వస్తాయి. ప్రభుత్వ సొమ్మును కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. గతంలో సీఎంఆర్ స్టాక్ మిల్లర్ల వద్ద లేదని అధికారులు చెప్పారు. ఇప్పుడు రూ.20 కోట్లకు పైగా స్టాకు రైస్‌మిల్లర్లు ఇవ్వాల్సి ఉందని అంటున్నారు. ఇందులో ఎవరిది తప్పో తేల్చాలని డిమాండ్ చేస్తున్నాం.

– లక్సెట్టిపేట జెడ్పీటీసీ సభ్యుడు ముత్తె సత్తయ్య

సమన్వయంతో పని చేయాలి

జిల్లా అభివృద్ధిలో అధికారులు సమన్వయంతో పని చేయాలి. అధికారిక కార్యక్రమాలను ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి. ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేస్తున్న వెంచర్లతోపాటు నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసే వెంచర్లపై అధికారిక చర్యలు తీసుకుంటాం. సభ్యులు సూచించిన ప్రతీ సమస్యను పరిశీలించి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తాం.

– కలెక్టర్ బదావత్ సంతోష్

అధికారులు హాజరు కావాలి

జెడ్పీటీసీలు, ఎంపీపీలను ప్రతీ ప్రభుత్వ కార్యక్రమానికి ఆహ్వానించాలి. సభ్యులకు ముందుగానే సమాచారం ఇవ్వాలి. జెడ్పీ సమావేశానికి జిల్లా ఉన్నతాధికారులు వచ్చేలా చూడాలి. వారి సమాధానం సభ్యులకు అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలి.

– జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

న్యూస్‌రీల్

కొనసాగుతున్న జాతర పనులు



జాతర స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల గోదావరి నదీ తీరాన రెండేళ్లకోసారి నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతర పనులు కొనసాగుతున్నాయి. ఈ నెల 21నుంచి 24వరకు జరిగే జాతర సమయం సమీపిస్తుండడంతో పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. వనదేవతల గద్దెలకు రంగులు పూర్తి చేశారు. జాతరకు వచ్చే భక్తుల కోసం స్థలాన్ని ట్రాక్టర్లతో చదును చేసే పనులు వేగిరం చేశారు. భక్తులు తాత్కాలిక ఆవాసం ఉండేలా చర్యలు చేపట్టారు. శాశ్వత మరుగుదొడ్లు, డ్రెస్సింగ్ రూం పనులు సాగుతున్నాయి.

ఏర్పాట్ల పరిశీలన

సమ్మక్క–సారలమ్మ జాతర జరిగే ప్రాంతంలో అధికారులు పరిశీలించారు. ఏసీపీ ప్రకాశ్ క్యూలైన్లు, నిఘా కెమెరాల ఏర్పాటు, వాహనాల పార్కింగ్, నిర్వహణపై ఈవో ముక్తారవిని అడిగి తెలుసుకన్నారు. అమ్మవార్లు వచ్చే సమయంలో బందోబస్తుపై సమీక్షించారు. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, కమిషనర్ మారుతిప్రసాద్, ట్రాఫిక్ సీఐ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలి



మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ సంతోష్

పాతమంచిర్యాల: పార్లమెంటు ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలని అన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

పాతమంచిర్యాల: జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని కలెక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కంకణాల భాస్కర్‌రెడ్డితో కలిసి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సొసైటీ నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయిస్తామని తెలిపారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, అవార్డులు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి, సొసైటీ ఎన్నికల అధికారి జే.నర్సయ్య, సొసైటీ ప్రతినిధులు, శాశ్వతసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గూడెంలో బ్రహ్మోత్సవాలు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 25 వరకు స్వామి వారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు తెలిపారు. 21న రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణం, 25న రథోత్సవం, సప్తాహ భజన కార్యక్రమాల ముగింపు ఉంటుందని తెలిపారు.

మేడారం జాతరకు రైలు

పాతమంచిర్యాల: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర వెళ్లే భక్తుల కోసం సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి వరంగల్ వరకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలు నడిపించనుంది. ఈ నెల 21 నుంచి 24వరకు పుష్‌పుల్ మెము ఎక్స్‌ప్రెస్ రైలు నడిపిస్తామని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ఉదయం 5.30గంటలకు బయల్దేరి ఉదయం 10గంటలకు వరంగల్‌కు చేరుతుంది. తిరిగి వరంగల్ నుంచి సాయంత్రం 4గంటలకు బయల్దేరి రాత్రి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చేరుకుంటుంది. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ప్రారంభమయ్యే రైలుకు రాలపేట్, ఆసిఫాబాద్ రోడ్, రేచినీరోడ్, బెల్లంపల్లి, మందమర్రి, రవీంద్రఖని, మంచిర్యాల తదితర స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

ఉద్యానవన పంటల సాగుకు సహకారం

- ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా
- నర్సరీ సందర్శన



సూచనలు చేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

బెల్లంపల్లి: ఉద్యానవన పంటలు సాగు చేసే ఔత్సాహిక రైతులకు సహకారం అందిస్తామని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం పట్టణంలోని గురిజాల వెళ్లే దారిలో ఉన్న ఐటీడీఏ ఉద్యానవన నర్సరీని ఆమె సందర్శించారు. పీవోగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా వచ్చిన ఆమెకు ప్రాజెక్టు ఉద్యాన అధికారి(పీహెచ్‌వో) సందీప్‌కుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. రోజ్‌గార్డెన్‌లో పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా నర్సరీలో పెంచుతున్న మామిడి, మునగ, మల్లే, ఇతర రకాల పూల, అలంకరణ మొక్కలు పరిశీలించారు. మామిడి, సపోటా తోటల ద్వారా మెరుగైన ఆదాయానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌వోను అడిగి తెలుసుకున్నారు. సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో నాటిన జామాయిల్, సర్వి మొక్కలను సందర్శించారు. ఎండాకాలంలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బెల్లంపల్లి నర్సరీ టెక్నికల్ అసిస్టెంట్ పూజా, సిర్పూర్ పేపర్‌మిల్లు అసిస్టెంట్ మేనేజర్ దేవరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో నాణ్యమైన వైద్యం

మందమర్రిరూరల్: ప్రభుత్వాసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందుతుందని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. వైద్య సేవలపై వైద్యాధికారి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు నమ్మకం కలిగే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

గోదావరి జలాలు అందించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రజలకు గోదావరి జలాల సరఫరాకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో బెల్లంపల్లిలో రూపాయి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. బెల్లంపల్లిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో మందమర్రి, బెల్లంపల్లికి గోదావరి జలాల సరఫరాకు ప్రత్యేకంగా పైపులైన్ వేశారని అన్నారు. ఆ పథకాన్ని నిలిపి వేసి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ ప్రాజెక్టు నుంచి తాగునీరు అందిస్తున్నారని, 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నీటిని విస్మరించారని పేర్కొన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన ప్రాణహిత ప్రాజెక్టు కాలువను బెల్లంపల్లి నియోజకవర్గం మీదుగా మళ్లించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలని కోరారు. బెల్లంపల్లిలో 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉండగా స్టాఫ్ 20 మంది మాత్రమే ఉన్నారని, ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని కోరారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు. సంబంధిత శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. హాజీపూర్ మండలంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంతో 12గ్రామాలు ముంపునకు గురయ్యాయని, రైతులు కూలీలుగా మారారని, కానీ తమకు ఒక్క చుక్క నీరు కూడా రాలేదని తెలిపారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ఇచ్చారని, ఈ ప్రాజెక్టు వల్ల రెండు టీఎంసీల కంటే మించి నీరు రావడం లేదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల వర్షాకాలంలో మంచిర్యాల పట్టణం మునిగిపోతోందని తెలిపారు. కరకట్టలను పటిష్టంగా నిర్మించి ఆదుకోవాలని అన్నారు. నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్లు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిని కోరారు. మంచిర్యాల మున్సిపాల్టీ అభివృద్ధిలో వెనుకబడిందని, భారీగా నిధులు కేటాయించాలని అన్నారు. నస్పూర్ మున్సిపాల్టీలో ఓసీ బాధితులకు న్యాయం చేయాలన్నారు. సింగరేణిలో లెటర్ల సంస్కృతి నడిచిందని, స్థానికేతరులకు ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపించారు. భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి నిధులను ఇక్కడే ఖర్చు చేయాలని, మున్సిపాల్టీల్లో వైకుంఠధామాలు నిర్మించాలని కోరారు. మంత్రి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

ఉద్యోగుల వ్యతిరేక విధానాలు సవరించాలి

నస్పూర్: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను సవరించాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, అసోసియేటెడ్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య, టీఎన్జీవో కేంద్ర సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో మధ్యాహ్న భోజన విరామం సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన, ధర్నా చేపట్టారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ, ఆదాయపు పన్ను పరిమితి రూ.10 లక్షలకు పెంపు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ, కార్మికచట్టాలు పునరుద్ధరించడం వంటి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు. కార్యదర్శి భూముల రామ్మోహన్, కోశాధికారి సతీష్‌కుమార్, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్కెట్లో నకిలీ ట్యాబ్లెట్లు

- మంచిర్యాలలో సీజ్ చేసిన అధికారులు
- 'డ్రగ్స్ లైసెన్స్' లేని కంపెనీ ఉత్పత్తుల అమ్మకం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



డ్రగ్స్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్న థయామిన్ హైడ్రోక్లోరైడ్ 100ఎంజీ ట్యాబెట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లాలోని కొన్ని మెడికల్ ఏజెన్సీలు అనుమతి లేని ట్యాబ్లెట్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయి. రోగాలను నయం చేసే ట్యాబ్లెట్లు డ్రగ్స్ లైసెన్స్ లేకుండా తయారీ చేస్తున్న కంపెనీల నుంచి తెచ్చి విక్రయిస్తున్నట్లు డ్రగ్స్ కంట్రోలర్ అధికారులు గుర్తించారు. రెండ్రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని శ్రీరామ్ మెడికల్ ఏజెన్సీలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న 1800 ట్యాబ్లెట్లు, రూ.30వేల విలువైన నకిలీ 'క్లింథియా 100ఎంజీ' ట్యాబ్లెట్స్(థయామిన్ హైడ్రోక్లోరైడ్ 100ఎంజీ) సీజ్ చేశారు. వీటిని బెరిబెరి, పెల్లగ్రా, వర్నికే-కొర్సాక ఆఫ్ సిండ్రోమ్, గర్భిణులకు సైతం రోగ నిరోధకత పెంచేందుకు కూడా వాడుతుంటున్నారు. ఇలాంటి కీలకమైన వ్యాధి నయం చేసే మందులను డ్రగ్స్ లైసెన్స్ పొందిన కంపెనీలే తయారీ చేసి విక్రయించాలి. అయితే ఆహార ఉత్పత్తుల కింద అనుమతి తీసుకుని హర్యానాలోని ఓ కంపెనీ తయారు చేసి విక్రయిస్తోంది. ఇది చట్టపరంగా విరుద్ధం. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల నకిలీ మందులు అమ్ముతున్నట్లు ప్రభుత్వ దృష్టికి రావడంతో అన్ని చోట్ల తనిఖీలు ముమ్మరం చేశారు. మంచిర్యాల పట్టణంలోనూ డ్రగ్ లైసెన్స్ లేకుండా అమ్ముతున్న ట్యాబ్లెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పుట్టగొడుగుల్లా ఏజెన్సీలు, దుకాణాలు..

జిల్లా కేంద్రంతోపాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో పుట్టగొడుగుల్లాగా మందుల ఏజెన్సీలు, దుకాణాలు వెలుస్తున్నాయి. కోవిడ్ తర్వాత మరింత ఎక్కువయ్యాయి. జిల్లాతోపాటు ఆసిఫాబాద్, మహారాష్ట్ర నుంచి వైద్యం, చికిత్స, మందుల కోసం జిల్లాకు అనేక మంది రోగులు వస్తుంటారు. వీరి బలహీనతను ఆసరా చేసుకుని అనుమతి లేని మందులను కూడా మార్కెట్‌లో గుట్టుగా విక్రయిస్తున్నారు. కొన్ని ఏజెన్సీలు ధనార్జనే ప్రధాన ధ్యేయంగా ఇలాంటి ట్యాబ్లెట్లు ప్రజలకు అమ్ముతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నిత్యం తనిఖీలు చేయాల్సి ఉన్నా చేయడం లేదు. ఇక ప్రజలు సైతం ఫిర్యాదులు ఇవ్వకపోవడంతో ఇలాంటివి వెలుగులోకి రావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వాటిని గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం ప్రతీ ట్యాబ్లెట్, మందుల లేబుల్ జాగ్రత్తగా పరిశీలించాలి. ఆహార ఉత్పత్తికి సంబంధించినదా? లేక రోగాన్ని నయం చేసేదా? ఎక్కడ తయారీ చేస్తున్నారు? ధర, గడువు తేదీ, ఇతరవన్నీ కచ్చితంగా తెలుసుకున్నాకే కొనుగోలు చేయాలి. లేకపోతే ఆరోగ్యముప్పు కలిగే అవకాశం ఉంది. ఎవరిపైనైనా అనుమానం వస్తే డ్రగ్స్ కంట్రోల్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలి. ట్యాబ్లెట్లు, మందులు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కార్మిక చట్ట సవరణలు ఆపాలి



జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ర్యాలీ



రైల్వేస్టేషన్ ఎదుట ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను ఖండించాలని జాతీయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మంచిర్యాలలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ సామాన్య కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడం చేతకాని కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగాల పరిశ్రమలను అమ్మడానికి పూనుకుందని విమర్శించారు. ప్రభుత్వ రంగాల పరిశ్రమలు, సంస్థలను విక్రయిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్, ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ రంగాల పరిశ్రమలు అమ్ముతూ పోతే దేశంలోని యువతకు ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. స్కీం వర్కర్లు, అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో, వారికి ఉద్యోగభద్రత కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, అఖిల భారత కేత్ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి అజ్మీర లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ నాయకులు మేకల రాములు, ఏఐటీయూసీ నాయకులు ఖలిందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌలు, గోలి శంకర్, మధు, రాయమల్లు, సీఐటీయూ నాయకులు ప్రకాష్, కుమార్, బాపు, కుమారీ, ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం, రాయమల్లు, అరుణ, రత్నం తిరుపతి పాల్గొన్నారు.

లక్క కోసం వృక్ష మేధం


ముక్కిడిగూడం, జాజులపేట అటవీ ప్రాంతంలో నేలకొరిగిన బొజ్జ, తిరుమాను వృక్షాలు


మహారాష్ట్రలోని ఏటపల్లి వద్ద అధికారులకు పట్టుబడిన లక్క వాహనం, నిందితులు (ఫైల్)

- అడవిలో సేకరిస్తున్న గ్రామస్తులు
- నేలమట్టమవుతున్న వేలాది చెట్లు
- అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు
- యథేచ్ఛగా సాగుతున్న దందా
- గ్రామస్తుల ఫిర్యాదుతో వెలుగులోకి..

వేమనపల్లి: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత వెంట ఉన్న అడవుల్లో లక్క సేకరణ జోరుగా సాగుతోంది. దీనిపై అభ్యంతరాలు లేకపోవడంతో ఇది తయారయ్యే చెట్లను విచ్చలవిడిగా నేలకూలుస్తున్నారు. మూడు నెలలుగా రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో వీటి వ్యాపారం భారీ స్థాయిలో జరిగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై అటవీశాఖ అధికారులు ఆలస్యంగా స్పందించారు. రెండు నెలల క్రితం లక్క సేకరణదారులపై దృష్టి సారించారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహెరి, సిరోంచ, ఏటపల్లి అటవీ డివిజన్ల నుంచి చాలామంది నది దాటి వచ్చి వేమనపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం అడవుల్లోని లక్క సంపద తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. జాజులపేట ముక్కిడిగూడం, కళ్లంపల్లి, రాంపూర్, రాగులపల్లి గ్రామాల్లోని కొందరు వ్యక్తులతో కుమ్మక్కై లక్క తీసుకెళ్లినట్లు తెలుపుతున్నారు. కిలోకు రూ.400 చొప్పున కూలీల నుంచి కొనుగోలు చేసి నది దాటించి రూ.1,500 నుంచి రూ.1,800కి కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అటవీ అధికారులు దాడులు జరపగా మహారాష్ట్రకు చెందిన కొందరు అధికారుల కల్లుగప్పి ప్రాణహిత నది దాటి పారిపోయారు. ముక్కిడిగూడెంకు చెందిన ఎనిమిది మందితోపాటు లక్క స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

లక్కతో ఉపయోగాలివి..

బొజ్జ, తిరుమాను వృక్షాలపై తయారయ్యే లక్కతో అనేక ఉపయోగాలున్నాయి. రంగుల అద్దకం, వార్నిష్ తయారీ, రబ్బర్, పాలిష్ తయారీలో లక్కను వాడతారు. లక్కతో గాజులూ తయారు చేస్తారు. బంగారు ఆభరణాల తయారీలోనూ ఉపయోగిస్తారు. ఏవైన వస్తువులు తయారు చేసి భద్రత కోసం లక్కతో సీల్ చేస్తారు. బొజ్జ, తిరుమాను వృక్షాలపై ఈ లక్క పురుడు పోసుకుంటుంది. లాక్సిఫెర (లక్క), టకార్డియా (లక్క) అని దీనికి పేరుంది. ఉష్ణమండల దేశాల్లో ఈ లక్క ఉత్పత్తి ఎక్కువ. లక్క కీటకం చెట్లపై చేరి కొమ్మలను అంటిపెట్టుకుని రసాన్ని పీల్చి లక్కను విసర్జిస్తుంటాయి. ఈ విధంగా ఉత్పత్తి అయ్యే లక్కకు మంచి డిమాండ్ కూడా ఉంది.

లక్కకు మంచి డిమాండ్

ప్రాణహిత తీరం వెంట ఉన్న అటవీ ప్రాంతాల్లో బొజ్జ వృక్షాలపై లభ్యమయ్యే లక్కకు మంచి డిమాండ్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లక్కను ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు తరలించి రూ.5వేల నుంచి రూ.8వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పక్కనే ఉన్న మహారాష్ట్ర ఏటపల్లి వద్ద డిసెంబర్ 16వ తేదీన అక్కడి అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటర్ అశోక్‌పవార్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువైన లక్క స్వాధీనం చేసుకున్నారు. జీపు సీజ్ చేసి చెన్నూరి సంపత్, చీపెల్లి నారాయణ, చెన్నూరి పురుషోత్తం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రదీప్‌జ్ఞానేంద్ర, సుభాష్‌కుష్వన్స్‌పై కేసు నమోదు చేశారు. పట్టుబడిన లక్క 21 బస్తాలు కాగా, వేమనపల్లి, దహెగాం మండలాల నుంచి తరలిస్తున్నట్లు పైకేసులో పేర్కొనడం గమనార్హం.

ఫిర్యాదుతో వెలుగులోకి ఇలా..

ఇటీవల గ్రామాల్లో రాజకీయ విభేదాలతో లక్క వ్యవహారం వెలుగులోకి వచ్చింది. లక్క సేకరణ కోసం అడవుల్లోని బొజ్జ, తిరుమాను వృక్షాలు నేలకూలినా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని సీఎఫ్, డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేసినట్లు తెలుపుతున్నారు. స్థానిక అధికారులు వంట చెరుకు కోసం పెళ్లి ఇతర అవసరాల కోసం కలప తెచ్చుకుంటే కేసులు పెడుతున్నారని వాపోతున్నారు. ఒడ్డుగూడం, కళ్లంపల్లి, రాంపూర్ బీట్‌లలో లబ్దిగుట్ట, మొద్దులగుట్ట, చిన్నగుట్ట, పాశినితోన ప్రాంతం వెంట వేలాది బొజ్జ, తిరుమాను వృక్షాలు నేలకూలినట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే స్పెషల్ ఫోర్స్ అటవీ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య


బాపు (ఫైల్)

భీమిని: ఓ వృద్ధుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిట్టూర్‌పల్లి గ్రామానికి చెందిన ఏటకారి బాపు (65) ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లాడు. రెండురోజులుగా కుటుంబీకులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం బిట్టూర్‌పల్లి గ్రామ సమీపంలోని తన చేను పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఉండడాన్ని మేకల కాపరులు గమనించారు. అతడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

పాతమంచిర్యాల: మంచిర్యాల–పెద్దపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కే.సురేశ్ తెలిపారు. మృతుడి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మృతుడు క్రీంకలర్ ఫుల్ షర్టు, బ్లూకలర్ జీన్స్ ధరించి ఉన్నాడని తెలిపారు. ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకునేందుకు పట్టాలు దాటుతుండగా అదే పట్టాలపై బల్లార్షా నుంచి రామగుండం వైపు వెళ్లే రైలు బండి తగిలి మృతి చెంది ఉంటాడన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 8712658596 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం, నిందితుడితో పోలీసులు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన టేకు కనకయ్య చుట్టుపక్కల గ్రామాల నుంచి పీడీఎస్ రైస్ తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్మేందుకు వ్యాన్‌లో తరలిస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడిన రైస్ విలువ సుమారు రూ.60 వేలు ఉంటుంది. పట్టుబడిన వ్యక్తితోపాటు బియ్యంతో కూడిన వ్యాన్‌ను తదుపరి చర్యల కోసం మందమర్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

‘కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి’

పాతమంచిర్యాల: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కౌశిక్‌రెడ్డి ఆంధ్ర పాలకులకు అమ్ముడుపోయి ఉద్యమకారులపై దాడులు చేసిన ద్రోహి అని విమర్శించారు.

కొత్త గనులు కేటాయించాలి


కోల్ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణికి కొత్త గనులు కేటాయించాలని సెంట్రల్ కోల్ సెక్రటరీ అమృత్‌లాల్‌మీనాను ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అధికారుల సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన మీనాను ఆయన కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న రాష్ట్ర, దేశ పారిశ్రామిక అవసరాలను తీరుస్తుందని తెలిపారు. గనుల జీవితకాలం దగ్గరపడటంతో అవి మూతపడే స్థాయికి వచ్చాయని, కొత్తగనులు కేటాయిస్తేనే సింగరేణి ముందుకెళ్తుందని చెప్పారు. ఇప్పటికే బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్ విద్యుత్ రంగంలోనూ సింగరేణి తనదైన శైలిలో ముందుకు వెళ్తుందని తెలిపారు. సంస్థను రక్షించడానికి కొత్త గనులు అత్యవసరమని పేర్కొన్నారు. దీనిపై మీనా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జనక్‌ప్రసాద్ తెలిపారు.

చెన్నూర్‌లో సస్పెన్షన్ల పర్వం


విచారణ చేస్తున్న సీఈవో నరేందర్

- నాడు ఏవో.. నేడు ఏడీఏ, ఏవో
- ఏడాది వ్యవధిలో ముగ్గురిపై వేటు

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయశాఖలో ఏడాదిగా సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. యూరియా ఇండెంట్ కోసం ఫర్టిలైజర్స్ డీలర్ల వద్ద డబ్బుల వసూలుకు పాల్పడుతున్నాడనే ఆరోపణల మేరకు గత నెల 24న జెడ్పీ సీఈవో నరేందర్ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. సీఈవో నివేదిక మేరకు చెన్నూర్ ఏడీఏ జాడి బాపు, ఏవో కవితను సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడాదిలో ముగ్గురు..

చెన్నూర్ వ్యవసాయశాఖలో ఏడాది కాలంగా ముగ్గురు అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. 2022లో చెన్నూర్ ఏవోగా విధులు నిర్వహించిన సుధాకర్ తోటి మహిళ ఉద్యోగినిపై వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణల మేరకు ఉన్నతాధికారులు వేటు వేశారు. అనంతరం చెన్నూర్ ఏవోగా కవిత బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో ఫర్టిలైజర్ డీలర్ల వద్ద యూరియా ఇండెంట్‌ల కోసం ఏవోతో పాటు ఏడీఏలు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల మేరకు ఇరువురిని సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి కల్పన ఉత్తర్వులు జారీ చేశారు.

అవినీతి ఆరోపణలతో..

పదేళ్ల క్రితం చెన్నూర్ ఏవో సుంకన్నను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అప్పటి ఫర్టిలైజర్ డీలర్ పోటు శ్రీనివాస్‌రెడ్డి వద్ద సుంకన్న డబ్బులు డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏవో సుంకన్న డీలర్ శ్రీనివాస్‌రెడ్డి నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆనాటి నుంచి నేటి వరకు వ్యవసాయశాఖలో అవినీతి పర్వం కొనసాగుతోందనడానికి గతంలో సుంకన్న ఘటనే ఉదాహరణ అని చెన్నూర్ రైతులు, ఎరువుల డీలర్లు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్


నిందితుడితో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తాండూర్: అక్రమంగా గంజాయి తరలి స్తున్న ఒకరిని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎ స్సై లచ్చన్న సిబ్బందితో లింగధరిగూడెం వెళ్లే మార్గంలో తనిఖీలు చేపట్టారు. లింగధరి గూడెం గ్రామానికి చెందిన జాడి రుక్మాజీ అనుమానాస్పదంగా కనిపించగా అతడిని అ దుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. అతడిని విచారించగా తన ఇంట్లో పెంచిన గంజాయిని తాండూర్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నానని నిందితుడు పేర్కొన్నా డు. నిందితుడిని తాండూర్ పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: ఇంటర్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రేమ విఫలమై, చదువుపై ఇష్టాన్ని పోగొట్టుకుని ఆత్మహత్యకు పాలప్పడినట్లు తెలుస్తోంది. ఎస్సై మహేందర్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తుమ్మిడిగూడ సమీపంలోని గోండ్‌గూడకు చెందిన టేకం అంబుబాయి, కృష్ణ దంపతుల కుమారుడు శ్రీవర్ధన్(17) మంచిర్యాలలోని ఓ ఇంట్లో మరో ముగ్గురు మిత్రులతో కలిసి అద్దెకుంటున్నాడు. స్థానిక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. స్వగ్రామం గోండ్‌గూడకు చెందిన ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఈ విషయంలో కత్తితో చేతిపై కోసుకున్నాడు. గురువారం రాత్రి గదిలో ఎవరూ లేనపుడు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. శ్రీవర్ధన్ స్నేహితులు వచ్చి చూడగా మృతదేహం వేలాడుతూ కనిపించింది. మృతు డి తల్లి అంబుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ అరవింద్, హెచ్‌ఎం కృష్ణారావు తెలిపారు. శుక్రవారం పాఠశాల అవరణలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ నెల 17 నుంచి 19వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు పాఠశాల నుంచి సత్యభామ, నందిని, అంజలి, మత్తుబాయి ఆదిలాబాద్ జట్టు నుంచి పాల్గొంటారని తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్: రవీంద్రఖని రైల్వేస్టేషన్ స మీపంలో శుక్రవారం రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు మంచిర్యాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని పేర్కొన్నారు. తెలుపు షర్టు, నల్లరంగు జీన్స్ ధరించి ఉన్న మృతుడి వయస్సు దాదాపు 30 నుంచి 35 వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుతాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712580664 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గురుకులాల్లో ఉద్యోగాలకు ఎంపిక


రాజేశ్వరి


సునీల్‌కుమార్


మమత

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన కొల్లూరి రాజేశ్వరి తెలంగాణ సోషల్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా ఎంపికైంది. ముత్యంపల్లికి చెందిన సొప్పరి సునీల్‌కుమార్ మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో సోషల్ పీజీటీగా నియమితులయ్యారు. పల్లంగూడకు చెందిన ఏదుల మమత ఫిజికల్ సైన్స్ పీజీటీగా మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలకు ఎంపికైంది. మమత తండ్రి భీమయ్య మండలంలోని కొత్తతిరుమలాపూర్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. ఈసందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు నియామకపత్రాలు అందుకున్నారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

19న స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్


అధికారుల ద్వారా వివరాలు తెలుసుకుంటున్న జీఎం

మందమర్రిరూరల్: సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువత కోసం సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి మందమర్రిలోని సింగరేణి సిమ్‌టార్స్ ఆఫీస్ ప్రాంగణంలో స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. శనివారం ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలు సేకరించారు. ఆయన వెంట రియా ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ అధికారులు ఉన్నారు.

సమ్మెకు మద్దతుగా ఆందోళనలు


ఎస్సార్పీ 3, 3ఏ గనిపై నిరసన తెలుపుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: దేశవ్యాప్త గ్రామీణ బంద్, సమ్మెలో భాగంగా సింగరేణిలో కార్మిక సంఘాల నాయకులు మద్దతుగా ఆందోళనలు చేపట్టారు. సింగరేణిలో సమ్మెకు దూరంగా ఉన్న సంఘాలన్నీ వివిధ రూపాల్లో నిరసన తెలిపాయి. శుక్రవారం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్, సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రం బొగ్గు పరిశ్రమలను ప్రైవేట్ పరం చేయడానికి కుట్ర చేస్తోందని, ఇందులో భాగంగా కొన్ని బ్లాక్‌లను అదాని, అంబానీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, నాయకులు రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, అఫ్రోజ్‌ఖాన్, కారుకూరి నగేశ్, మోతె లచ్చన్న, గునిగంటి నర్సింగ్‌రావు, మారుపెల్లి సారయ్య, నవీన్‌రెడ్డి, దొడ్డిపట్ల రవీందర్, లచ్చిరెడ్డి, మొగిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్సార్పీ 3, 3ఏ గనిపై..

దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా ఎస్సార్పీ 3, 3ఏ గనిపై ఐఎన్టీయూసీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉదయం విధులకు హాజరైన సమయంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని కేంద్ర ప్రభుత్వ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించారు. ఐఎన్టీయూసీ పిట్ సెక్రటరీ పెంట శ్రీనివాస్, నాయకులు రిక్కుల గోపాల్‌రెడ్డి, సాంబయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ..

సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో ర్యాలీ తీశారు. యూనియన్ కార్యాలయం నుంచి శ్రీరాపూర్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్, సుధాకర్, శ్రీనివాస్, నవీన్, సదానందం, బాలకృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి తెలిపారు. సీసీసీలోని సింగరేణి ముక్కిడి పోశమ్మ ఆలయం వద్ద కంపెనీ ఆధ్వర్యంలో జరిగే జాతర ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరగనుందని తెలిపారు. భక్తుల కోసం కంపెనీ ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీపాలు తదితర సౌకర్యాలు కల్పించామని తెలిపారు. కార్మిక కుటుంబాలతో పాటు పరిసర ప్రాంతాల్లోని భక్తులు కూడా ఈ జాతరకు వచ్చి అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని సూచించారు. ఇంకా చేయాల్సిన ఏర్పాట్లను ఆయన అధికారులకు సూచించారు. ఏరియా ఎస్వోటూ జీఎం రఘుకుమార్, డీజీఎం సివిల్ ఆనంద్‌కుమార్, ఏరియా వర్క్‌షాప్ ఎస్ఈలు మల్లయ్య, సతీశ్ చక్రవర్తి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, ఆలయ పూజారి రమేశ్ పాల్గొన్నారు.

కల్వరీ మినిస్ట్రీకి రక్తదాత అవార్డు


కలెక్టర్ ద్వారా అవార్డు తీసుకుంటున్న సిబ్బంది

కాసిపేట: బెల్లంపల్లి, సోమగూడెం జాతీయ రహదారి పక్కనున్న కల్వరీ మినిస్ట్రీ ప్రవీణ్ ఫౌండేషన్‌కు శుక్రవారం విశిష్ట రక్తదాన అవార్డు దక్కింది. కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా మినిస్ట్రీ ప్రతినిధులు శ్రీనివాస్, శామ్యూల్ అవార్డు, పత్రాన్ని తీసుకున్నారు. రక్తదానాన్ని మించిన ప్రాణదానం లేదని వారు పేర్కొన్నారు. రక్తదానంపై అవగాహన కల్పించడంతో పాటు స్వయంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ సొసైటీకి తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తం అందించినట్లు తెలిపారు. 2015నుంచి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న ప్రవీణ్, షారోన్ సేవలు గుర్తించి రెడ్‌క్రాస్ సోసైటీ తరపున ఫౌండేషన్‌కు బ్లడ్ డోనర్ మోటివేటర్ మెరిట్ సర్టిఫికెట్, స్వచ్ఛంధ సేవా అవార్డు ప్రకటించారు. కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నట్లు ప్రవీణ్, షారోన్ తెలిపారు.

పథకం ప్రకారమే దంపతుల హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్


హత్యకు గురైన దస్రూ, బైనబాయి దంపతులు (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): సొంత అన్నే తన ఇద్దరు కుమారులు, కూతురితో కలిసి తమ్ముడు, మరదలిని గొడ్డలితో నరికి హత్య చేసిన విషాదకర ఘటన గురువారం వాంకిడి మండలం ఖమాన గ్రామంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హత్యకు సంబంధించిన వివరాలు సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమాన గ్రామానికి చెందిన డెంగ్రె పత్రు, డెంగ్రె దస్రూ (50) ఇద్దరు అన్నదమ్ములకు పక్కపక్కనే పొలాలున్నాయి. మూడేళ్ల నుంచి ఇరు కుటుంబాల మధ్య పొలం గట్టు విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం పత్తేరడానికి వెళ్లిన ఇరుకుటుంబాలవారు మళ్లీ గొడవ పడ్డారు. దీంతో పత్రు కుటుంబ సభ్యులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. ఎలాగైన తమ్ముడు దస్రూ, మరదలు బైనబాయి (40)ని చంపేయాలని పథకం పన్నారు. పత్రు తన ఇద్దరు కొడుకులైన తిరుపతి, సాయికి గొడ్డళ్లు ఇచ్చి కూతురు మాయతో పాటు కర్ర పట్టుకుని ముందుగా పక్కనున్న చేనులో పత్తి ఏరుతున్న బైనాబాయిపై దాడి చేసి చంపేశారు. అక్కడి నుంచి కిలో మీటరు దూరంలోని మరో చేనులో పనులు చూసేందుకు వెళ్లిన దస్రూను వెంబడించి గొడ్డళ్లు, కర్రలతో దాడి చేసి హత్య చేశారు. మృతుల కూతురు సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకొన్న పత్రు, తిరుపతి, సాయి, మాయపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు.